క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సత్యనారాయణ మూర్తి

తాండూర్: మండలంలోని ఐబీ తాండూర్ ఉర్దూ మీడియం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, తెలుగు మీడియం పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను జిల్లా సెక్టోరియల్ అధికారి ఏ.సత్యనారాయణ మూర్తి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో కొనసాగుతున్న తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్డి మరమ్మతు పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ నారాయణను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మండల విద్యాధికారి ప్రభాకర్, ఎంఆర్‌సీ సీసీఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

కొమ్మెరలో ‘బడిబాట’



పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెరలో సోమవారం బడిబాట నిర్వహించారు. బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఇంటింటికీ తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించనున్నట్లు తెలిపారు.

కన్నెపల్లిలో అన్నదానం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో కార్తీక్ మహారాజ్ స్వామి సేవా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మహారాష్ట్రలోని చెప్రాడ కార్తీక్ మహారాజ్ స్వామి కన్నెపల్లి నుంచి భక్తులు ప్రతి ఏడాది డిసెంబర్ 31వ తేదీన పాదయాత్రగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నూతన సంవత్సర వేడుకలను సైతం అక్కడే జరుపుకుంటారు. దీంతో భక్తులు ప్రతి నెలా 10వ తేదీన కన్నెపల్లి మండల కేంద్రంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఎల్‌కే నగర్‌లో నివాసం ఉంటున్న పిట్టల సతీశ్ పేగు క్యాన్సర్‌తో బాధపడుతుండగా, 17వ వార్డు కౌన్సిలర్ పూదరి సునీత వారి కుటుంబానికి సోమవారం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. దాతలు ముందుకొచ్చి సతీశ్‌కు ఆర్థిక సాయం చేయాలని వార్డు నాయకుడు పూదరి ప్రభాకర్ కోరారు.

బీజేపీ సంబురాలు



టపాసులు కాలుస్తున్న బీజేపీ శ్రేణులు

వేమనపల్లి: భారత ప్రధానిగా మోదీ, కేంద్ర మంత్రులుగా బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు ప్రమాణ చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని నీల్వాయి గ్రామాల్లో మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుకొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఎస్టీ మోర్చ మండల అధ్యక్షుడు కుర్మ లస్మయ్య, కిసాన్ మోర్చ అధ్యక్షుడు మధునయ్య, మండల నాయకులు శ్రీకాంత్, పోశన్న, సతీష్, జాడి గోపాల్, సమ్మయ్య, మారుతి, రవీందర్, సంతోష్, రమేష్, తిరుపతిలు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో ప్రభాకర్

తాండూర్: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాండూర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందజేశారు. మండలంలో 6 నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద నివారణ చర్యలేవి..!



రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదకారకాలుగా ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టింపు లేని విద్యుత్ అధికారులు

బెల్లంపల్లిరూరల్: ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ప్రమాదకారకాలుగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ల వైపు కన్నెత్తి చూడకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. జీవాలు మృత్యువాత పడుతున్నా, మనుషులు ప్రమాదాలకు గురవుతున్నా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ప్రజలు భయం భయంగా రాకపోకలు కొనసాగిస్తున్నారు.



చాకేపల్లిలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

రానున్నది వర్షాకాలం...

వర్షాకాలంలో మరిన్ని విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వ్యవసాయ క్షేత్రాల్లో, ఆ ప్రాంతాలకు వెళ్లే దారుల్లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలి మూగజీవాలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. వానలు పడితే విద్యుత్ ఘాతాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయి.

ముందస్తు నివారణ చర్యలు...

ప్రమాదాలు జరిగి నష్టం.. ముఖ్యంగా ప్రాణనష్టం సంభవించక ముందే నివారణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేసి, విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్లను తొలగించి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం...

గ్రామాల్లో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద హేతువులుగా మారాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినప్పుడే రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, నామ మాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. పకడ్బందీగా గద్దెలు నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ ఇనుప కంచె అమర్చాల్సి ఉంటుంది. అయితే చాలా చోట్ల కంచెలు కానరావడం లేదు. దీంతో ఆ పక్కగా వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. అదుపు తప్పితే ప్రమాదంలో పడతామని భయపడుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు చాలా వరకు అధికారులు కంచెలు ఏర్పాటు చేయలేదు. మూగజీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు నివారించేలా ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి.

– ఎంబడి.సతీష్, బెల్లంపల్లి మండలం

ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి..



ఊర్లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లతో భయంభయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. చిన్న పిల్లలు తెలియక అటుగా వెళ్లి ప్రమాదబారిన పడే అవకాశం ఉంది. ప్రాణ నష్టం జరగక ముందే, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి.

– దుర్గం.రవి, చాకేపల్లి, బెల్లంపల్లి మండలం

చర్యలు తీసుకుంటాం

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతాం. ప్రమాదకరంగా ఉంటే ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోట మార్చడానికి చర్యలు తీసుకుంటాం. రక్షణ కంచె ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటూ కట్టడి చేస్తాం.

– ఆర్.రామ్‌మనోహర్, విద్యుత్ శాఖ ఏఈ

మురుగు నీటిని తొలగించిన అధికారులు

సాక్షి స్పందన

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ గ్రామంలో చేతిపంపు చుట్టూ బురద నీరు చేరుతుందని ‘మురుగునీరు తొలగించండి’ అనే శీర్షికన సోమవారం ‘సాక్షి’లో ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్, కార్యదర్శి స్పందించి బోరు పైపులైన్‌లో లీకేజీలను మరమ్మతులు చేసి బోరు చుట్టూ నీరు నిలవ్వలేకుండా రిపేరు చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



మరమ్మతు చేయిస్తున్న అధికారులు

జాతరలో మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి మారెమ్మ జాతరకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరు కాగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వివేక్ వెంకటస్వామి మొక్కులు చెల్లించుకొని గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జాతరకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశం ఉండటంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని కొత్తగూడెం కాలనీలో రూ.5లక్షలతో రోడ్డు పనులు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, మహేశ్‌తివారి పాల్గొన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే

రక్తదానం చేసిన పూర్వ విద్యార్థులు

మంచిర్యాలటౌన్: మందమర్రికి చెందిన మాంటిస్సోరి స్కూల్ 2012కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో 10మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్ర రెడ్డి మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేసేందుకు ప్రజలు ముందుకు రాకపోవడంతో రక్త నిల్వలు తగ్గిపోయాయని, పూర్వ విద్యార్థులు రక్తదానం చేయడం వల్ల తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు సమయానికి రక్తం ఎక్కించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి మహేందర్, సంయుక్త కార్యదర్శి రంజిత్ కుమార్, సాయికుమార్, వర్షిత్, శివసాయిరాం, శ్రీకాంత్, విక్రమ్, అనుదీప్, గిరినాల సాయికుమార్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యుత్ బకాయిలు చెల్లించండి

మందమర్రిరూరల్: మందమర్రి పరిధిలోని విద్యుత్ వినియోగదారులు వారికి ఇదివరకు ఉన్నటువంటి విద్యుత్ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని విద్యుత్ శాఖ ఇంజనీర్ మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని మార్కెట్ ఏరియా, దీపక్‌నగర్, శ్రీపతినగర్, పాలచెట్టు ఏరియా, దొరల బంగ్లాస్ ఏరియా, తదితర ఏరియాల్లో సిబ్బంది విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని, అందుబాటులో లేనివారు ఆన్‌లైన్ పేమెంట్ చేయాలని లేకుంటే మార్కెట్ వద్ద గల విద్యుత్‌శాఖ ఆఫీస్‌లో చెల్లించాలని సూచించారు. బిల్లులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

నిరుపయోగంగా సిస్టం ట్యాంక్

నస్పూర్: పట్టణ పరిధిలోని 2వ వార్డు చాపల మార్కెట్ సమీపంలో సిస్టం ట్యాంకులో నీరు నింపకపోవడంతో కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉంది. ట్యాంక్‌లో నీరు నింపకపోవడంతో కాలనీ వాసులు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యను పలుమార్లు స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు, తాగడానికే సరిపోతున్నాయని, సిస్టం ట్యాంకులోకి బోర్ వాటర్ నింపితే తమకు నీటి కొరత తీరుతుందని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకులో నీటిని నింపి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



చాపల మార్కెట్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న సిస్టం ట్యాంక్

సమాచారం

నేడు మంచినీటి సరఫరా నిలిపివేత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ పాత రైల్వే గేటు వద్ద ఫీడర్ మెయిన్ పైపు, ఎల్లంపల్లి నుంచి వచ్చే పంపింగ్ మెయిన్ పైపులైన్లు పగిలినందున మంగళవారం మంచిర్యాలలో తాగునీటి సరఫరాలో అంతరాయంతో సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తీగల మరమ్మతుల కారణంగా రాంనగర్, కుందారం, వాటర్ గ్రిడ్ 33 కేవీ ఫీడర్లకు సరఫరా నిలిపివేత ఉంటుందని ఏడీఈ వేణుగోపాల్ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రాంనగర్, కాలేజీరోడ్, ఎల్ఐసీ కాలనీ, రెడ్డి కాలనీ, ఐబీ చౌరస్తా ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా సంపత్

మందమర్రిరూరల్: తెలుగుదేశం పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వాసాల సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని టీఎన్టీయూసీ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన పట్టణ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ హాజరు కాగా ఆయన సమక్షంలో సంపత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. పట్టణంలోని సమస్యలపై ప్రజలు, పార్టీ నాయకులతో కలిసి పనిచేస్తానని, టీడీపీలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన బోధించుటకు అనుభవం ఉన్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. ఎకనామిక్స్, కామర్స్ బోధించడానికి ఉపాధ్యాయులు కావాలని ప్రకటించారు. పీజీటీ ఎకనామిక్స్ బోధించడానికి ఎంఏ ఎకనామిక్స్‌తో పాటు బీఈడీ ఉండాలని, పీజీటీ కామర్స్ బోధించుటకు ఎంకాంతో పాటు బీఈడీ అనుభవం కలిగిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 11 నుంచి 13వరకు తెలంగాణ మోడల్ స్కూల్ కాసిపేటలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు.

‘ప్రజావాణి’కి స్పందన అంతంతే..!



భీమారం: ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు



దండేపల్లి: ప్రజావాణికి హాజరైన అధికారులు



జన్నారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

దండేపల్లి: ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని నెలలుగా నిలిచిన ప్రజావాణి కార్యక్రమం, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సోమవారం మళ్లీ ప్రారంభమైంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని రెబ్బనపల్లి సమీపంలో ప్రభుత్వ భూముల్లో రాత్రి వేళ గుట్టుగా మట్టి, మొరం తవ్వకాలపై, లింగాపూర్‌లో భూసమస్యకు సంబంధించి ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు.

కాసిపేటలో అధికారులు రాలే..!

కాసిపేట: ప్రభుత్వం పేదల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణికి అధికారులు రాకపోవడంతో సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ జరగలేదు. ఎంపీడీవో సమావేశం ఉందని అందుబాటులో లేకపోవడంతో ఇతర శాఖల అధికారులు సైతం ఎవరూ హాజరుకాలేదు. దీంతో ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం నిర్వహించిన మొదటి సమావేశం మండలంలో జరగకుండా పోయింది.

జన్నారం: మండలంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రభుత్వ పథకాలైనా గ్యాస్ సబ్సిడీ, ఫ్రీ కరెంట్, గృహ లక్ష్మి పథకాలు అందని 48మంది నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు.

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. అయితే ప్రజల నుంచి అర్జీలు రాలేదు.

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో శ్రీపతి బాపురావు అధ్యక్షతన సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి దరఖాస్తులు రాలేదు. ఈ కార్యక్రమానికి కార్యాలయ సిబ్బంది, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ సుజాత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు, ఐకేపీ సీసీ శివరాం, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ మాత్రమే హాజరయ్యారు.

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణిలో ఒక్క ఫిర్యాదు వచ్చినట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు. ఈ ప్రజావాణిలో ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత పాల్గొన్నారు.



వేమనపల్లి: అధికారులతో మాట్లాడుతున్న ఎంపీవో



చెన్నూర్: ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలి



డీఏవోకు వినతిపత్రం అందజేస్తున్న బస్తీ వాసులు

బెల్లంపల్లి: తమ వార్డులో దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న అపరిష్కృత సమస్యలు తీర్చాలని బెల్లంపల్లి మున్సిపాలిటీ 18వార్డు కాంట్రాక్టర్ బస్తీ ప్రజలు కోరారు. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో డీఏఓ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. బస్తీలో రోడ్లు సరిగా లేవని కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టడంలో నిర్లక్ష్యం జరుగుతోందని తెలిపారు. సీసీ రోడ్లు నిర్మించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో దుర్గంధంతో బాధపడుతున్నామని, వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

పడిపోకముందే పట్టించుకోండి..!

అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండలంలోని ఎలకేశ్వరం గ్రామ సమీపంలో వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా చేసే లైన్‌లో స్తంభాలు పడిపోయే విధంగా ఉన్నాయి. వర్షాకాలంలో ఈ స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు తెలిపారు. నాలుగేళ్లక్రితం భీమారం ఎలకేశ్వరం మధ్య కరెంట్ స్తంభాలు పడిపోయి, పశువులు మరణించాయని గుర్తు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకొని స్తంభాలను సరిచేయాలని వారు కోరుతున్నారు.

సంబంధితఅధికారి : కుమారస్వామి, విద్యుత్‌శాఖ ఏఈ, భీమారం

ఫోన్ నంబర్ : 79016 78167



నాడు



నేడు

ఎండిన చెరువు.. ఎడారిలా ప్రాంతం

జైపూర్: మండలంలోని ఇందారం-రామారావుపేట మధ్య పెద్ద చెరువులో వర్షాకాలంలో వర్షపు నీరుతో పాటు నిత్యం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు నీరు వచ్చి చేరుతుంది. ఎప్పుడూ నీటితో కళకళలాడుతుంటుంది. ఎండాకాలం, వానాకాలం, చలికాలం తేడా లేకుండా నిత్యం నిండుకుండలా ఉండేది. కానీ ఎప్పుడూ ఎండిపోని ఆ పెద్ద చెరువు, ఇప్పుడు చుక్క నీరు లేకుండా ఎండిపోయింది. చెరువు కట్ట కళతప్పింది. నీరు లేక చెరువు బోసిపోతోంది.